





గోదావరిఖని సమ్మక్క - సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సల్లంగ చూడండి తల్లులారా..

- సమ్మక్క-సారలమ్మకు భక్తుల మొక్కులు
- కిటకిటలాడిన జాతర ప్రాంగణాలు
- నేడు దేవతల వన ప్రవేశం





గద్దెల వద్ద మొక్కుతున్న యువతులు, చిన్నారి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

తల్లులారా.. ఇంటిల్లిపాదిని సల్లంగ చూడండి.. అంటూ సమ్మక్క- సారలమ్మను భక్తులు వేడుకున్నారు. గద్దెలపై కొలువుదీరిన వనదేవతలను దర్శించుకు నేందుకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జాతర ప్రాంగణాలన్నీ కిటకిటలాడాయి. జిల్లాలోని గోదావరిఖని, గోలివాడ నీరుకుల్ల, కొలనూరు, ఈసాల తక్కళ్లపల్లి, గర్రెపల్లి, హనుమంతునిపేట, తురకల మద్దికుంట, మీర్జంపేట, మైదంబండ, ధర్మారం, జూలపల్లి, తదితర ప్రాంతాల్లో జరుగు తున్న సమ్మక్క సారలమ్మ జాతరకు శుక్రవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గోదావరిఖని, గోలివాడ, నీరుకుల్ల, కొలనూరులో జరిగిన జాతులకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క వనం వీడి గద్దెలపై దర్శనం ఇచ్చారు. కోరిన కోరికలు తీర్చే దేవుళ్లుగా, భక్తుల కొంగుబంగారమైన సమ్మక్క సారలమ్మలను అమ్మవార్లుగా ఆవాహం చేసుకొని, ఆ తల్లులకు శుక్రవారం ఇష్టమైన రోజు కావడంతో భక్తులంతా ఇదేరోజు ఇంటిల్లిపాది పిల్లపాపలతో తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. కోరిన కోర్కెలు తీరిస్తే ఎత్తు బంగారం ఇస్తామని మొక్కుకున్న భక్తులు తల్లులకు ఇష్టమైన బంగారం(బెల్లం) బుట్టలతో తలపైన ఎత్తుకొని గద్దెల వద్దకు వచ్చి సమర్పించారు. ధర్మారంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నీరుకుల్ల, కొలనూరు తదితర ప్రాంతాల్లోని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, గోదావరిఖని, గోలివాడ తదితర ప్రాంతాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం సాయంత్రం సమ్మక్క-సారలమ్మల వన ప్రవేశంతో జాతర ముగియనున్నది.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని హన్మంతునిపేట, పెద్దకల్వల, తుర్కలమద్దికుంట గ్రామాల్లో జాతరకు భక్తులు పోటెత్తారు. తుర్కలమద్దికుంటలో మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజలు చేశారు. వెంట వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్య తదితరులు న్నారు. హన్మంతునిపేటలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావులు ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించారు.

మంథని : మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మల సేవల్లో రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం తరలించారు. నిలువెత్తు బంగారాన్ని(బెల్లాన్ని) జోకించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు తన నెత్తిన బంగారాన్ని పెట్టుకొని ఆలయంలో దర్శినానికి వెళ్లి సమర్పించారు. సమ్మక్క-సారలమ్మ తల్లులను, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మంత్రి సీతక్క ఉన్నారు.

ఓదెల : మండలంలోని కొలనూర్, మడక, జీలకుంటలో వనదేవతలకు భక్తులు మొక్కులు సమర్పించారు. కొలనూరు గుట్టలో జాతరను ఎమ్మెల్యే విజయరమణారావు సందర్శించారు. బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మడకలో మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ యాకయ్య, ఎంపీపీ రేణుకాదేవి, జడ్పీటీసీ గంట రాములు మొక్కులను చెల్లించారు. కాగా, కొలనూర్ జాతరలో జేబుదొంగలు చేతివాటానికి ప్రదర్శించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ జేబులో ని 11వేల రూపాయలు దొంగలించారు. అలాగే సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి జేబులో నుంచి నగదు రూ.6వేలు కొట్టేశారు.

సుల్తానాబాద్ : మండలంలోని నీరుకుళ్ల జాతరకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఏసీపీ కృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నీరుకుళ్లలో అమ్మవార్లను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నారాయణపూర్ జాతర కూడా భక్తులతో కిక్కిరిసిపోయింది.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని మీర్జంపేట, పెగడపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. మీర్జంపేటలో మండలంతో పాటు ఓదెల, టేకుమట్ల, జమ్మికుంట తదితర మండలాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పెగడపల్లి, మీర్జంపేట జాతరలో తల్లులను దర్శించుకొని మొక్కులు సమర్పించారు. ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్‌లు సమ్మక్క -సారలమ్మలను దర్శించుకున్నారు.

అంతర్గాం : మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరంలో జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రదేశాన్ని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సందర్శించారు. ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే సన్మానించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హనుమాన్‌రెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకట్, తహసీల్దార్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : మండలంలోని ధర్మారం, నందిమేడారంలో వనదేవతలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. వెంట ధర్మారం మాజీ ఎంపీపీ కొడారి హాన్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర్మారం, నందిమేడారం, ఎర్రగుంటపల్లి, కొత్తూర్, కటికెనపల్లి, బొట్లవనపర్తి, దొంగతుర్తి చామనపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జూలపల్లి : మండలంలోని అబ్బాపూర్‌లో జాతరను ఎమ్మెల్యే విజయరమణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కోల్‌సిటీ : గోదావరిఖని గోదావరితీరం మినీ మేడారాన్ని తలపించింది. శుక్రవారం జాతరకు భక్తులు పోటెత్తారు. సల్లంగ సూడు తల్లీ అంటూ.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ జాతర కమిటీ ప్రతినిధులను, అధికారులను సన్మానించారు. అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ గద్దెల వద్ద మొక్కులు చెల్లించారు. గోదావరిఖని ఏసీపీ మడక రమేష్ ఆధ్వర్యంలో సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు సేవలందించారు. కాగా, మూడు రోజుల పాటు భక్తుల విశేష పూజలు అందుకున్న సమ్మక్క, సారలమ్మ శనివారం సాయంత్రం వన ప్రవేశం చేయనున్నారు.



గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జీఎం శ్రీనివాస్



సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద మొక్కుతున్న మహిళ



సమ్మక్క-సారలమ్మ దర్శనానికి క్యూలైన్‌లో నిలుచున్న భక్తులు



గోదావరి ఒడ్డున శివుడి విగ్రహం వద్ద భక్తుల సందడి



నీరుకుళ్లలో భక్తుల రద్దీ..



మేడారంలో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు..



ఖనిలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పూజలు..



ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ ఎదురుకోళ్లు..



ధర్మారంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ పూజలు



నీరుకుళ్లలో ఎమ్మెల్యే విజయరమణారావు పూజలు



హన్మంతునిపేటలో మాజీ ఎమ్మెల్యే దాసరి..

ముత్తారం సింగిల్‌విండో చైర్మన్, వైస్‌చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

ముత్తారం, ఫిబ్రవరి 23 : ముత్తారం పీఏసీఎస్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ పోతిపెద్ది రమణారెడ్డిపై అవిశ్వాసం నెగ్గింది. తాత్కాలిక చైర్మన్‌గా మద్దెల వెంకటలక్ష్మి వైస్‌చైర్మన్‌గా అల్లం గోవర్ధన్ ఎన్నుకున్నారు. సింగిల్‌విండోలో మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా, అవిశ్వాసానికి అనుకూలంగా 10 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. 9మంది డైరెక్టర్లు సుమారు 20 రోజుల క్రితం అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు, సింగిల్‌విండో అధికారికి అందజేశారు. పది సంవత్సరాలుగా సింగిల్‌విండో చైర్మన్‌గా గుజ్జుల రాజిరెడ్డి కొనసాగుతున్నారు. విండోలో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ ఉన్నతాధికారులకు ఇటీవల కాంగ్రెస్ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. సహకార సంఘం చైర్మన్‌గా రాజిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా రమణారెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి కొనసాగారు. ఇప్పుడు సింగిల్‌విండో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ముత్తారం సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగే వరకు తాత్కాలిక చైర్మన్‌గా వెంకటలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా గోవర్ధన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు సహకార సంఘం ఎన్నికల అధికారి రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ సువర్ణ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు సురేందర్ రెడ్డి రూప తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవిశ్వాసాలు జోరందుకున్నాయి.

కూరగాయల సాగుతో మెరుగైన ఆదాయం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కూరగాయల సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

జూలపల్లి, ఫిబ్రవరి 23: కూరగాయల పంటల సాగుతో రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మెండె మల్లేశం,తిరుపతిరెడ్డి అనే రైతులు కొన్నేళ్లుగా కూరగాయల పంటలను సాగుచేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయల సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని, రైతులు సంఘటితంగా ఉంటే మరిన్ని లాభాలను పొందవచ్చన్నారు. మండలంలో కూరగాయలు సాగును చాలా మంది రైతులు చేస్తున్నారని, రైతులందరు కలిసి ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా గోడౌన్, కోల్డుస్టోరేజీలను నాబార్డు వారి సహకారంతో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, దీంతో కూరగాయలకు మంచి ధర లభించి రైతులు ఆదాయం పొందుతారని కలెక్టర్ తెలిపారు. అలాగే రైతులకు కూరగాయల సాగులో అన్ని రకాల సహాయసహకారాలు, సలహాలు అందించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారని, వారి సేవలు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, హార్టికల్చర్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని ప్రత్యూష, ఏఈవోలు కిరణ్మయి, శ్రీవాణి, రైతులు లోక రవిందర్‌రెడ్డి, కొప్పుల మహేష్, మెండె రాజన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

మంథనిరూరల్, ఫిబ్రవరి 23: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ సూచించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ మంథని మండలం గుంజపడుగులో గ్రామ పంచాయతీలో పౌర పఠన మందిరం (లైబ్రరీ)ను ఎంపీపీ కొండా శంకర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ జీవన విధానాన్ని విద్య మారుస్తుందని, కుటుంబంలో ఒక సభ్యుడు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకుంటే, సమాజంలో చాలా మందికి స్ఫూర్తి నిలుస్తాడన్నారు. అతడి కుటుంబం సైతం విద్యపై శ్రద్ధ పెట్టిన కారణంగా మంచి స్థితిలో ఉంటుందని ఆమె తెలిపారు. అనంతరం ఎంపీపీ కొండ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ ఉదరి లక్ష్మీలచ్చన్న, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం, ఫిబ్రవరి 23 : మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సెక్రటరీ రాజు, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణు మాధవ్, ఎంపీపీ జక్కుల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో పీఎఫ్ కమిషనర్

వేములవాడ ఫిబ్రవరి 23 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రావిడెంట్ ఫండ్ సౌత్ జోన్ అడిషనల్ సెంట్రల్ కమిషనర్ వైశాలి దయాల్ దర్శించుకున్నారు. శుక్రవారం ఆమె కోడె మొక్కు చెల్లించుకుని శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈఓ ప్రతాప నవీన్ శ్రీస్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, గోలి శ్రీనివాస్, అరుణ్ తదితరులు ఉన్నారు.


ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈఓ నవీన్

సిరిసిల్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 23: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది తరలించారు.

మంటలు అంటుకుని చెట్లు దగ్ధం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గుట్టపై చెట్లకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పుతున్నారు. రాత్రి వరకు మంటలు అదుపులోకి వచ్చాయని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

వైభవంగా నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 23: మండలంలోని నల్లగొండ నృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించు రథోత్సవానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. ఉదయం నుంచి భక్తులు ఎగువ, దిగువ ఆలయాల్లో నృసింహస్వామిని దర్శించుకొని స్వామి వారికి పట్టెనామాలు కోరమీసాలు సమర్పించుకున్నారు. స్వామి వారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులు చలువ పందిళ్ల కింద సేద తీరుతున్నారు. ఆలయ చైర్మెన్ సత్యనారాయణ రావు, ఈవో అనూషతో పాటు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తహసీల్దార్‌పై కేసుతో కలవరం

● సీఐ నటేష్‌పై సీపీ రిపోర్ట్‌తోనే సస్పెన్షన్ వేటు?
● పలువురు పోలీసు, ఇతర శాఖల అధికారులకు నోటీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదానికి సంబంధించిన భూమిని నిందితులతో కుమ్మక్కై మ్యుటేషన్ చేసినట్లు ఆరోపణలపై గతంలో కొత్తపల్లి తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన చిల్ల శ్రీనివాస్‌పై కొత్తపల్లి ఠాణాలో మంగళవారం కేసు నమోదు కావటం కలకలం సృష్టించింది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ తహసీల్దార్‌కు మూడు రోజుల కిందట కరీంనగర్ రూరల్ పోలీసుల సీఆర్‌పీసీ 160 కింద నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న తహసీల్దార్ శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ రూరల్ సీఐ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉన్నది.

అయితే శుక్రవారం ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసి తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై అరెస్టు చేయకుండా గురువారం వరకు మినహాయింపు పొందినట్లు తెలిసింది. మరో వైపున జగిత్యాల టౌన్ సీఐ సిహెచ్ నటేష్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆయన గతంలో కరీంనగర్ ఒక టో ఠాణా సీఐగా పనిచేసిన సమయంలో పలు భూవివాదాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. సీఐపై కరీం నగర్ సీపీ రిపోర్టు తయారు చేసి ఐజీకి పం పించారని ఈ నేపథ్యంలో ఆయనపై విచారణ జరిపి సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది. రెండు నెలల కిందట కూడా పలు ఆరోపణ లపై కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఐలపై సీపీ, ఐజీకి రిపోర్ట్ పంపించి బదిలీవేటు వేసిన విషయం విదితమే. కరీంనగర్‌లో భూకబ్జాలకు సంబం ధించి ఇప్పటి వరకు 7 కేసులు నమోదుకాగా 13 మంది అరెస్టు అయ్యారు.

● సీపీ, కలెక్టర్ బదిలీ తప్పుడు ప్రచారంపై నిఘా

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లు బదిలీ అయ్యారంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి వైరల్ చేయడంపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ దుష్ప్రచారాన్ని ఎవరు చేస్తున్నారు? ఎవరు చేయిస్తున్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇటీవల కొందరు భూకబ్జాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టుకాగా వారి అనుచరులుగా చెప్పకుంటున్న కొంతమంది యువకులు ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించి చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.



భూ విక్రయంలో మోసం చేసి, బెదిరింపులు

● ముగ్గురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 23: భూమి విక్రయంలో మోసం చేయటమే కాకుండా చంపుతానని బెదిరింపుల కు పాల్పడిన ఘటనలో జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న దుర్గం జగన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్,సదాశివపల్లికి చెందిన సింగిరెడ్డి వెంకటరమణారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌టీపీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొంది ప్రస్తుతం కరీంనగర్ భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఎల్లాల అజేంధర్‌రెడ్డి 2019లో మానకొండూర్ మండలం సదాశివపల్లిలోని సర్వే నెంబరు 442, 447/2, 443లలోని మూడెకరాల అరగుంట భూమిని కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన దుర్గం జగన్‌గౌడ్, తిరుపతి అనే వ్యక్తి ద్వారా కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఆ భూమిలోకి వెళ్లిన అజేంధర్‌రెడ్డిని, సింగిరెడ్డి వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి అడ్డుకుని ఆ భూమి తనదేనని చెప్పటంతో ఇద్దరి మధ్య భూవివాదం తలెత్తింది. ఈ విషయంపై మాట్లాడేం దుకు అజేంధర్‌రెడ్డిని సదాశివపల్లికి పిలిచిన దుర్గం జగన్‌గౌడ్, నందెల్లి మహిపాల్, సింగిరెడ్డి వెంకట రమణారెడ్డి ముగ్గురు కలిసి అజేంధర్‌రెడ్డిని చంపుతానని బెదిరించారు.

మోసపోయిన బాధితుడు అజేంధర్‌రెడ్డి శుక్రవారం మానకొండూర్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురు నిందితులపై ఐపీసీ 420, 467, 386, 506, 120-బి రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ కేసులో దుర్గం జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచగా జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వసంతోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 23: బీర్‌పూర్ లక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్స వాలలో భాగంగా శుక్రవారం లక్ష్మీ నరసింహులకు వసంతోత్సవం కార్యక్రమాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్సవ ముహూర్తులను ప్రత్యేకమైన వేదికపై ఆశీనులగావించి వేదమంత్రోచ్ఛరణల మధ్య వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కెడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటి మెంబర్ ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంటేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్యాక్స్ డైరెక్టర్ మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 23: మండల సహకార సంఘం డైరెక్టర్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రెడ్డి గురువారం సాయంత్రం కరీంనగర్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై మండలంలోని పొత్తూర్‌కు తిరిగి వస్తుండగా కమాన్‌పూర్ వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌రెడ్డిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, ఎంపీటీసీ పట్నం అశ్వినీశ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సౌమ్యుడు శ్రీనివాస్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామన్నారు.

పంది అడ్డురావడంతో బైక్ నుంచి పడి..

కరీంనగర్ క్రైం: కొత్తపల్లి మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఎండీ ఖలీల్లా(35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖలీల్లా తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా పంది అడ్డురాగా అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయాలై మరణించాడని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని రైతు..



గౌరు రాజయ్య(ఫైల్)

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం రాళ్లపేట శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాళ్ల పేట గ్రామానికి చెందిన గౌరు రాజయ్య (52) అనే రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి రాజయ్య తన పొలం వద్ద నుంచి గేదెను తీసుకొని ఇంటికి వస్తున్నాడు. వెనక నుంచి ప్యాసింజర్ ఆటో ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి..

కరీంనగర్ క్రైం: భగత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో తన సోదరుడి గృహప్రవేశం సమయంలో ప్రమాదవశాత్తుగా కాలుజారి కిందపడి ఈదులగట్టెపల్లికి చెందిన మీస రాంచంద్రం(46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న భవనం మూడో అంతస్తు పైనుంచి కిందపడడంతో రాంచంద్రంకు తీవ్రగాయాలయ్యాయన్నారు. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, హైదాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు ఆర్టీసీ డిపో-1లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి వృద్ధురాలు మృతి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 23 : పట్టణానికి చెందిన సిర్ప సుజాత(60) శుక్రవారం ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందిం దని ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సిర్ప సుజాతకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం భర్త లక్ష్మీనారాయణ, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరగగా సుజాత పట్టణంలోని కూరగాయాల మార్కెట్ ఏరియాలో ఉంటోంది. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది.ఆసుపత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మానసికంగా ఇబ్బంది పడుతోంది. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువలో పడి కొట్టుకుపోతుండగా సమీపంలోని వారు చూసి బయటకు తీసి ఆసపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సుజాత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వీణవంక, ఫిబ్రవరి 23 : మండలంలోని దేవంపల్లి గ్రామంలో గల కాకతీయ డిబిఎం 6 ఉపకాల్వలో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాకతీయ ప్రధాన కాల్వ నుంచి డీబీఎం 6 ఉపకాల్వలో ఓ వ్యక్తి మృత దేహాన్ని గ్రామస్థులు గుర్తించి కాల్వలో నుంచి బయటికితీసారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న సీఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23: హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన షెడ్యూల్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో రెండు సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్యలో జన్మించిన బాల బాలికలు ప్రవేశాలకు అర్హులని అన్నారు. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదా యం గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల మించరాదని, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం సంబంధిత తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లనుంచి పొం దాలని సూచించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను మీసేవ, మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి పొందాలని, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల జిరాక్సు ప్రతులపై గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి దరఖాస్తుతో పాటు జత చేయాలని సూచించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి ఈనెల 25 నుంచి మార్చి 12వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో పొంద వచ్చన్నారు. దరఖాస్తులను మార్చి 12న సాయంత్రం ఐదుగంటలలోపు రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో జతచేసి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అంజన్న పైసలేవీ..?

● ఖాతాకు చేరని రూ.37.90లక్షల టెండర్ సొమ్ములు ● కొండగట్టులో అధికారుల నిర్వాకం



మల్యాల, ఫిబ్రవరి 23: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే వివిధ దుకాణాల టెండర్‌దారులు చెల్లించే డబ్బులు అంజన్న ఖాతాకు చేరకపోవడం తీవ్ర దుమారం లేపుతోంది. వ్యాపారులు తమ టెండర్ సొమ్ములను దేవస్థానానికి విడతల వారీగా చెల్లిస్తుండగా 2023-24 సంవత్సరానికి గాను కొందరు వ్యాపారులు దేవస్థానం అధికారు లకు చెల్లించారు. వాటికి రశీదులు కూడా ఇవ్వగా ఆ డబ్బులు మాత్రం దేవస్థానం ఖాతాలో చేరలేదు. ఇటీవల దీనిపై అనుమానాలు వ్యక్తం కావడంతో దేవస్థానం అధికారులు తమ అకౌంట్స్ తనఖీలు చేశారు. ఇందులో రూ 37.90లక్షలు బ్యాంక్ లెక్కల్లో కనిపించకపోగా విచారణ చేశారు. సంబంధిత వేలంల సెక్షన్ అధికారి వాటిని ఖాతాలో జమ చేయనట్లు గుర్తించారు. కొబ్బరికాయలకు సంబంధించి రూ.31.80లక్షలు, కిరాణం రూ.60వేలు, హోటల్ రూ.50వేలు, సులబ్ కాంప్లెక్స్ రూ.2లక్షలు, పూలు, పండ్లు రూ.3లక్షలు ఆయా వ్యాపారుల నుంచి అధికారులు వసూలు చేసినప్పటికీ వాటిని జమ చేయకుండా సొంతంగా వినియోగించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు వసూలు చేసి ఖాతాలో జమ చేయనట్లు తేలడం చర్చ నీయంశంగా మారింది.

దీంతో గతంలోని వాటిని కూడా తనిఖీలు చేయాలనే డిమాండ్లు వెల్లువెత్తుతుండగా దేవాదాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వెంకటేష్‌ను వివరణ కోరగా.. ఖాతాలో జమ చేయనట్లు తమ దృష్టికి వచ్చిందని సదరు ఉద్యోగికి నోటీసు అందించనున్నట్లు తెలిపారు. సదరు వేలంల సెక్షన్ అధికారిని కూడా సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్ స్విచాఫ్ వచ్చింది.

కాంగ్రెస్ హామీలకు నో 'గ్యారెంటీ'

● పథకాల అమలుకు సిద్ధంగా లేని సర్కారు
● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
● కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, ఫిబ్రవరి 23: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుతో కలిసి కాళేశ్వరం ఆలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు బతుకు భరోసా ఇవ్వలేకపోతోందన్నారు. సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి, మంత్రులు మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడు తు న్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పక్కన బెట్టి వాటిపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రమంతా సాగు, తాగు నీటిని అందిస్తే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో మేడిగడ్డలో చిన్న పిల్లర్‌లో సమస్య ఏర్పడితే సరిచేసి నీళ్లు అందించాలని గానీ కాలయాపన చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బ్లాక్ మెయిలింగ్, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ చర్యలను ఖండిస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలి



రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 23: కరీంనగర్ ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాటరన్, మానేరు విద్యాసంస్థల అధినేతి కడారి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పోటీల వాల్ పోస్టర్‌ను ఆయన ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే కుంగ్‌ఫూ క్రీడలకు కరీంనగర్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందన్నారు. కరాటే కుంగ్‌ఫూలతో ఆత్మస్థైర్యం ఆత్మ విశ్వాసం పెంపొందుతా యన్నారు. ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కరాటే కుంగ్‌ఫూలలో శిక్షణ పొందాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఇలాంటి విద్యలో శిక్షణ పొందాలని సూచించారు. తొలిసారిగా జిల్లా కేంద్రంలో కుంగ్‌ఫూలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. పోటీల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, నిర్వాహకులు ఎ శ్రీనివాస్, జూడో సంఘం రాష్ట్ర బాధ్యులు సిలవేరి మహేందర్, ఉషు సంఘం ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు లింగమూర్తి, మోయిన్, కోడూరి శేఖర్, లంక రవివర్మ, సాయిమానేరు ప్రిన్సిపాల్ సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 23: బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి మాదిగలను గెలిపించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌కు చేరుకున్న ఆయన నగరంలో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలు విని, ఆయా పార్టీలకు ఓటు వేస్తే తెలంగాణ రాష్ట్రం మతకల్లోలాలు, కింది స్థాయి జాతుల అణచివేతతో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి వెలుతుందన్నారు. ఆయా పార్టీలకు ఓటు వేయకుండా సబ్బండ కులాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వంపై ఎన్నడూ ఒత్తిడి చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాదిగలను రాజకీయంగా అణచి వేశారని ఆరోపించారు. బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. అందులో భాగం గానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లను తగ్గించిందని ఆరోపించారు. మళ్లీ బీజేపీకి ఓటు వేస్తే ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా దక్కదన్నారు. రాష్ట్రంలో మాదిగలు బీజేపీని ఓడించడమే 30ఏళ్ల వర్గీకరణకు ఇచ్చే సంపూర్ణ మద్దతు అని అన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం అతి ప్రమాదకరంగా ఉందని, దీనిని కాపాడాల్సిన బాధ్యత చైతన్యవంతులైన మాదిగలపై ఉందన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మెడపట్ల దుబ్బయ్య, అక్కనపల్లి కరు ణాకర్, బండ శ్రీను, ఆరెపల్లి అరుణ్‌కుమార్, కనకం వంశీ, గడ్డ యాదయ్య, బొర్రెల్లి సురేష్, షైన ఉపేందర్, ముత్యపాగం నరసింహారావు, ప్రసాద్, నక్క మహేశ్,దేవరకొండ నరేష్, గద్దల రమేశ్, జోగు గణేశ్, మీసాల మహేశ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రభాకర్ (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 23: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గన్నెవానిపల్లె పరిధిలోని నిమ్మవానిపల్లెలో శుక్రవారం విద్యుదాఘాతం తో నిమ్మల ప్రభాకర్(42) మృతి చెందా డు. ప్రభాకర్ తన పొలం వద్ద గడ్డికోయడానికి వెళ్లగా, బోరు మోటార్‌కు వచ్చే సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా అవడంతో గమనించని ప్రభాకర్ వైరుకు తగలడంతో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

జగిత్యాల టౌన్ సీఐ నటేశ్ సస్పెన్షన్

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ -1 ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, క్రైం బర్కింగ్ ఆరో పణల్లో విచారణ జరిపిన నేపథ్యంలో నటేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, కేసులు నమోదు చేయకుండా జాప్యం వహించ డం, అవినీతికి పాల్పడడం వంటి ఆరోపణలపై ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు నటేశ్‌పై విచారణ జరిపించినట్లు సమాచారం. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి ఇజ్రాయిల్ దేశానికి పంపిస్తానని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యవహారంలో సీఐ నటేశ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్‌ను ఇటీవల బదిలీ చేయగా రాజకీయంగా ఒత్తిడి తెచ్చి బదిలీని నిలిపివేయించుకోవడం సైతం ఉన్నతాధికారుల అసంతృప్తికి కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఐ నటేశ్ సస్పెండ్ వ్యవహారం పోలీసువర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23: పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో గల ఓ మూడతస్తుంతల భవనంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖాధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న నివాస గృహాల వాళ్లు భయందోళనకు గురయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 23 : మండలంలోని బంద నకల్ గ్రామానికి చెందిన అల్మాస్‌పూర్ ఆశయ్య (52) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శేఖ ర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధ పడుతున్న ఆశయ్య మనస్తాపంతో ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటలోని ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణిం చాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఆశయ్య కూతు రు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

చందుర్తి, ఫిబ్రవరి 23 : చందుర్తి మండలం లింగంపేట శివారులో చిరుత పులి సంచారం మండల ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. మండలంలోని లింగంపేట అటవీ ప్రాంతం శివారులో చిరుతపులి దాడిలో మేక మృతి చెందినట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. లింగంపేట అటవీ ప్రాంతంలో గ్రామంలోని ఈగ రాజేశంకు చెందిన మేక మృతి చెందిన విషయాన్ని గ్రామస్థులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. అటవీ ప్రాంతం శివారులో మృతి చెందిన మేకను పరిశీలించగా చిరుతపులి దాడి చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

గొల్లపల్లిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: మండలంలోని గొల్లపల్లి , బొప్పాపూర్ గ్రామాల్లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు మొడుసు సత్యంరెడ్డి దుకాణంలో దొంగలు గురువారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. బొప్పాపూర్ సత్తే పీరీల దర్గా సమీపంలోని సత్యంరెడ్డి దుకాణం తాళాలు పగలగొట్టి రూ.3 వేల విలువైన కూల్ డ్రింక్స్, సిగరెట్ ప్యాకెట్లు, ఇతర తినుబండారాలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రంగి, ఫిబ్రవరి 23: రుద్రంగి మండలం దేగవాత్ తండా గ్రామంలోని కున్‌సోత్ తండాకు చెందిన కున్‌సోత్ ముత్యాలి (90) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సంవత్సరాలుగా ముత్యాలి అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.


గల్ఫ్‌లో బొప్పాపూర్ వాసి హఠాన్మరణం


ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23:ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు(45) బహ్రెయిన్‌లో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిమ్మల రాజు 15 ఏళ్లుగా బహ్రెయిన్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, రోజులాగే విధులకు వెళ్లిన అతను ఛాతిలో నొప్పితో అస్వస్థతకు గురయ్యాడన్నారు. మిత్రులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని తెలిపారు. పరీక్షించిన అక్కడి వైద్యుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారన్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

▶▶ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▶▶ నిరంతరాయంగా దర్శనాలు ▶▶ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి



హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 23: తెలంగాణలో మాదిగలకు12శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల21న ప్రారంభమైన జోడోయాత్ర శుక్రవారం పెద్దపల్లికి చేరుకుంది. యాత్రలో పాల్గొన్న బృందానికి మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్ని ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అతిపెద్ద కులమైన మాదిగలు 12శాతం ఉన్నప్పటికీ 7శాతం మాత్రమే ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ వస్తోందన్నారు. మాదిగలకు ఉప ముఖ్యమంత్రితోపాటు రెండు ఎస్సీ, ఒకటి జనరల్ పార్లమెంట్ స్థానాలు రాను న్న పార్లమెంట్ ఎన్నికల్లో కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్ని మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి స్థానాన్ని తెలంగాణ ఉద్యమకారులు గజ్జెల కాంతంకు, వరంగల్ పార్లమెంటు స్థానాన్ని డాక్టర్ పిడమర్తి రవిలకు కేటాయించాలని కోరారు. తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్, ఎంహెచ్ పీఎస్ అధ్యక్షుడు ఖైస ఉపేందర్, మహా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్య పాగ నరసింహరావు, ప్రసాద్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, గద్దల రమేష్, జోగు గణేష్, మీసాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పుట్ట లింగమ్మ ట్రస్టు షెల్టర్

మంథని, ఫిబ్రవరి 23: మేడారం మహాజాతరలో వారం రోజుల పాటు విధి నిర్వాహణకు వచ్చిన వివిధ జిల్లాలు, డిపోలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులకు జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు చొరవతో పుట్ట లింగమ్మ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన విశ్రాంతి భవనం షెల్టర్‌గా మారింది. గత ఆదివారం నుంచి మంథని బస్టాండ్ నుంచి మేడారం జాతరకు ప్రయాణికులను చేరవేయడానికి రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది, ఇతర ఉద్యోగులు విరామ సమయంలో విశ్రాంతి భవనంలో సేద తీరుతున్నారు. దీనిపై పలువురు ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి జడ్పీ చైర్మన్ పరామర్శ

మంథని, ఫిబ్రవరి 23: మండలంలోని చిల్లపల్లిలో అక్కపాక లింగయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు శుక్రవారం పరామర్శించారు. వెంట బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

మార్చి 11లోపు దరఖాస్తులు సమర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 23 : 2024-25 విద్యా సంవత్సరంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశం కోసం షెడ్యూల్డ్ కులాల బాల, బాలికలు ఆసక్తి గలవారు తమ దరఖాస్తులు మార్చి 11లోపు సమర్పించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగైలేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు రెండు సీట్లు కేటాయించడం జరిగిందని, దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మార్చి 11 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాల తెలిపారు.

జాతర ఆదాయంలో 30శాతం నిధులు ఇవ్వండి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 23: గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఆదాయం నుంచి 30శాతం నిధులను జనగామ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఇవ్వాలని బీఆర్ఎస్, జనగామ గ్రామ అభివృద్ధి కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు బీఆర్ఎస్ నాయకులు తోకల రమేష్, అర్కుటి శంకర్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తుంగపిండి లింగస్వామి వినతిపత్రం అందజేశారు. ఈ జాతరకు వస్తున్న ఆదాయంలో 30శాతం నిధులను ఈ ఆలయ అభివృద్ధికి ఇవ్వాలని కోరారు. జాతర కమిటీ మొదట పదివేల రూపాయాల నుంచి ఇప్పుడు 30వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కానీ ఈసారి 30శాతం నిధులను ఇప్పించేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు ఊదరి రవీందర్, దుర్గం భూమయ్య, ఆరెల్ల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బొక్కలవాగు నద్దినాలా భూముల్లో నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు - ముంపు ముప్పు పొంచి ఉందంటున్న స్థానికులు


నద్దినాలా భూముల్లో పక్కా భవన నిర్మాణం


డంపింగ్ యార్డు స్థలం పక్కన ఆక్రమణలు..

మంథని, ఫిబ్రవరి 23: మంథని పట్టణాన్ని ఆనుకొని ప్రవహిస్తున్న బొక్కలవాగు పరివాహక ప్రాంతమైన నద్దినాలా భూములకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కొందరు ఆ భూముల్లో పక్కా కట్టడాల నిర్మాణాలు, భూముల అక్రమణకు పాల్పడుతున్నారు. మంథని-కాటారం ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న ఈ భూమికి డిమాండ్ బాగా ఉండటంతో పాటు త్వరలోనే రోడ్డు 4 లైన్లు లేదా నేషనల్ హైవేగా మారే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో నిర్మాణాలు, కబ్జాలు పెరుగుతున్నాయి. ఒకవైపు సూరయ్యపల్లి క్రాసింగ్ సమీపంలో నద్దినాలాకు సంబంధించిన భూమిలో భవన నిర్మాణ పనులు జరుగుతుండగా, మరోవైపు మున్సిపల్ డంపింగ్ యార్డు స్థలం పక్కనే కొందరు వ్యక్తులు స్థలంలో తాత్కాలిక షెడ్లు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు పలువురు వెల్లడించారు. బొక్కలవాగు పరివాహక ప్రాంతాన్ని తగ్గిస్తూ నద్దినాలా భూములను కబ్జా చేయడం వల్ల భవిష్యత్తులో మంథని పట్టణానికి ముంపు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే భవన నిర్మాణదారులు మాత్రం తమకు అన్ని అనుమతులున్నాయని చెబుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 23: కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల సాధన కోసం పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని ఖండిస్తూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని లేబర్‌కోర్టు వద్ద పైలాన్ చౌరస్తాలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. పార్టీ జిల్లాకార్యదర్శి కె.రాజన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల కోసం పాదయాత్ర చేస్తున్న రైతులపై రబ్బరు బుల్లెట్ కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. నాయకులు ఈ.నరేష్, ఏ వెంకన్న, బి.అశోక్, శంకర్, దుర్గయ్య, బాబు, ధర్మేందర్, రాజేశం, నర్సయ్య పాల్గొన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 23: రైతులపై కాల్పులను నిరసిస్తూ శుక్రవారం మండలంలోని సెంటినరీకాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యువ రైతు కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దొమ్మటి కొమురయ్య, హమీద్‌పాషా, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రాజయ్య, రాజమల్లు, తిరుపతి, హబీబ్ పాషా, హరిబాబులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్

కమాన్‌పూర్, ఫిబ్రవరి 23 : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. ప్రమోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిద్దిపల్లి గ్రామాన్ని సందర్శించారు. టీబీ రహిత గ్రాపంచాయతీ సర్టిఫికేషన్‌కు కావాల్సిన మార్గదర్శకాల ప్రకారం ఎంపిక కోసం పరిశీలించారు. క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం వివిధ నిర్మూలన కార్యక్రమాలను చేపడుతామని, ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాలను చేపట్టి, అమలు చేసిన గ్రామాల్లో టీబీ కేసులు నమోదు కాని గ్రామాలను టీబీ గ్రామపంచాయతీలుగా గుర్తించడం జరుగుతుందన్నారు. పెద్దపల్లి జిల్లాలోని 11 గ్రామపంచాయతీలను టీబీ రహిత గ్రామాలుగా ఎన్నిక చేశామన్నారు. ఫిబ్రవరి 22న పీహెచ్‌సీ కొలనూర్ పరిధిలోని ఎల్లయ్యపల్లి, ఉప్పరపల్లి గ్రామాలు తనిఖీ చేస్తామని మిగిలిన టీబీ రహిత గ్రామపంచాయతీలను కూడా తనిఖీ చేస్తామని, జిల్లాలోని ఇతర గ్రామపంచాయతీలు కూడా ఈ గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీసుకొని వివిధ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు చేపట్టి టీబీరహిత గ్రామాలుగా వచ్చే సంవత్సరంలో గుర్తింపు పొందుటకు కృషి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన వయోజన విద్యా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి23: లివ్ ఫర్ క్రైస్ట్ మిని స్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని ఎఫ్‌సీఐ న్యూటీడీఎస్ చర్చిలో నాలుగు రోజులు నిర్వహించిన వయోజన విద్యా ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఐపీఎఫ్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, 14వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వయోజన విద్యా ద్వారా ఎన్నో కుటుంబాలు వెలుగుబాటలో పయనించడానికి దోహదపడిందన్నారు. లివ్ ఫర్ క్రైస్ట్ మిని స్ట్రీస్ డైరెక్టర్ కాసిపేట స్వామిదాస్ మాట్లాడుతూ 20మంది టీచర్లకు అవసరమైన బోధన పరికరాలను రీరైట్ లైఫ్ సంస్థ సహకారంతో ఉచితంగా అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ సెక్రెటరీ వినోద, సూపర్‌వైజర్లు కాసిపేట లింగయ్య, కాసిపేట రిచర్డ్, జాన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్

- బస్టాండ్ లోపలికి ఆటోలు వెళ్లకుండా చర్యలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 23: గోదావరిఖని బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ 'ఆంధ్రజ్యోతి'లో ట్రాఫికర్ అనే శీర్షికన వచ్చిన కథనంపై శుక్రవారం రామగుండం ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆటో డ్రైవర్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటోలు బస్టాండ్ లోపలికి వెళ్లవద్దని, వెళితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అడ్డాలోనే ఆటోలు పెట్టుకోవాలని, అడ్డా నుంచే ప్యాసింజర్లను తీసుకెళ్లాలని, బస్సుల చుట్టూ ఆటోలు తిప్పవద్దని, అడ్డాకు సంబంధంలేని ఆటోడ్రైవర్లు లోపలికి వెళ్లవద్దని సూచించారు. ఆటోలు లోపలికి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆటోడ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే లాస్యనందిత మృతి కలిచివేసింది

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను కలిచివేసిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. తాను శాప్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు తాను కంటోన్మెంట్‌లో ఉండేవాడినని, లాస్య ఇల్లు తన ఇంటి పక్కనే ఉండేదన్నారు. ఎప్పుడూ నవ్వుతూ అందరితో కలివిడిగా ఉండే లాస్య మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు సన్మానం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 23: రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రామగుండం కార్పొరేషన్‌కు రూ.100కోట్లు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, కొప్పుల శంకర్, మడ్డిపెల్లి మల్లేష్, దాసరి విజయ్, మాలెం మధు, కల్వల రంజిత్ పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని, ఫిబ్రవరి 23: జిల్లాలోని మంథని, రామగుండం నియోజకవర్గాల్లో శనివారం ప్రారంభమవుతున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, యాత్ర ఇన్‌చార్జి రావుల రాంనాథ్ కోరారు. గురువారం వారు విలేకరుల మాట్లాడుతూ.. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఆరు నెలలు గడవక ముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. మన దేశం మరింత అభివృద్ధి చెందాలన్నా.. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్నా.. మరో సారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని.. ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ యాత్రలో ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణరెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు పాల్గొంటారన్నారు. ఈ యాత్రలో బీజేపీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతరవేన క్రాంతికుమార్, చిలువేరి సతీష్‌కుమార్, సబ్బని సంతోష్‌కుమార్, బూడిద తిరుపతి, బోగోజు శ్రీనివాస్, కొండపాక సత్యప్రకాష్, మోహన్‌రావులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: ఆర్డీవో

రామగిరి, ఫిబ్రవరి 23: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటుహక్కును విధిగా నమోదు చేసుకోవాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ వెల్లడించారు. శుక్రవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల(మంథని)లో మంథని నియోజకవర్గ క్యాంపస్ అంబాసిడర్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులని గుర్తు చేశారు. అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని ప్రజలకు ఇచ్చారని పేర్కొన్నారు. ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక యాప్‌లు ఉన్నాయన్నారు. ఫారం 6 ద్వారా సైతం నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రాంచందర్‌రావు, పీడీ పింగిళి కృష్ణారెడ్డి, అంబాసిడర్లు సాయి, సాయిగీత, జాస్మిన్, విష్ణు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.